సాక్షి
ఖమ్మం
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



జిగేల్‌మనేలా విద్యుత్ వెలుగులు

అదనపు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ప్రత్యామ్నాయ లైన్లతో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తగ్గుతున్నాయి. 10లో



తాగునీటి ఇబ్బందులు రావొద్దు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. 10లో

గరిష్టం / కనిష్టం
41° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

అండర్ బ్రిడ్జికి నిధులు కేటాయించండి



జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ధంసలాపురం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డుకు సర్వే పూర్తయినందున భూసేకరణ, నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. నిధులు లేక బ్రిడ్జి, రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతుండగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈమేరకు నిధుల విడుదలపై జీఎం సానుకూలంగా స్పందించగా.. గతంలో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని, డోర్నకల్ – కొత్తగూడెం మార్గంలోని గాంధీనగర్ స్టేషన్‌లో రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఎంపీ కోరారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి ఈనెల 27న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు , 7నుంచి, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ప్రశ్నపత్రాల లీకేజీపై వదంతులను ఎవరూ నమ్మొద్దని, అలాంటి సమాచారం ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని డీఈఓ సూచించారు.

పాఠశాల అవసరాలకు రూ.3.50లక్షల వితరణ



దాత విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండల పరిషత్ పాఠశాలలో సౌకర్యాల కల్పన, అవసరాల కోసం సదాశివునిపేటకు చెందిన మందపాటి కరుణాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య విజయలక్ష్మి బుధవారం రూ.3.50 లక్షలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పేరిట ఈ నగదును ఫిక్స్ చేసి ఏటా వచ్చే రూ.25వేల వడ్డీని సౌకర్యాల కల్పనకు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విజయలక్ష్మిని హెచ్‌ఎం బుచ్చిబాబు సన్మానించగా, విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ తిరునగరి కుమారి, ఉపాధ్యాయులు సీహెచ్.నిరంజన్, ఎం.విక్రమ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి మామిడి మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో గురువారం నుంచి మామిడి రైతుబజార్ మొదలవుతుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. రైతులు, వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ రైతు బజార్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. సహజసిద్ధమైన పరిస్థితుల్లో పండించి, కార్బైడ్ రహితంగా మాగబెట్టిన మామిడి పండ్లనే మాత్రమే ఇక్కడ విక్రయిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధుసూదన్ సూచించారు.

రైతులను ఇబ్బంది పెడితే మిల్లుల సీజ్



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎం శ్రీలత

కల్లూరు: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా, తాలు, తేమ పేరిట జాప్యం చేస్తే మిల్లులు సీజ్ చేస్తామని పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీలత హెచ్చరించారు. కల్లూరులోని పలు రైస్ మిల్లులను ఆర్డీఓ ఎల్.రాజేందర్, తహసీల్దార్ పులి సాంబశివుడుతో కలిసి బుధవారం ఆమె తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దించకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారనే ఫిర్యాదులతో తనిఖీ చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ సరిపడా హమాలీలను నియమించుకుని ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలని స్పష్టం చేశారు. తొలుత మండలంలోని ఆమె పుల్లయ్యబంజర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

సందేహాలా.. సదస్సులకు రండి

భూ భారతి చట్టంపై విస్తృత అవగాహన

- నేలకొండపల్లి మండలంలోని గ్రామాలతో పాటు మిగతా మండలాల్లోనూ నిర్వహణ
- రైతులకు సమాచారం ఇచ్చేలా తహసీల్‌లలో హెల్ప్‌డెస్క్‌లు



నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సదస్సులో వివరాలు ఆరా తీస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న ధరణి చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వం కొత్తగా భూ భారతిని ప్రవేశపెట్టిన విషయం విదితమే. తద్వారా పరిష్కారమయ్యే సమస్యలు, దరఖాస్తు విధానాన్ని వివరించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడమే కాక వారి నుంచి దరఖాస్తులే కాక సూచనలను సైతం స్వీకరిస్తున్నారు. జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నేలకొండపల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లోనే కాక అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న సదస్సులు ఈనెల 30వ తేదీ రకు కొనసాగుతాయి.

తొలుత అధికారులకు..

భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై తొలుత అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తహసీల్దార్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని అంశాలను వివరించారు. ఆ తర్వాత వారు మండల, గ్రామస్థాయి అధికారులకు రికార్డుల్లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వ భూముల మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, తప్పుచేసిన అధికారులపై ఎలాంటి చర్యలు ఉంటాయనే అంశాలపై విశదీకరించారు.

సదస్సులపై ప్రత్యేక దృష్టి

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన నేలకొండపల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సదస్సులు కొనసాగుతున్నాయి. ఎం



నేలకొండపల్లి తహసీల్‌లోని హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులు ఇస్తున్న రైతులు

పీడీఓ, ఎంపీఓ, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొని చట్టంలోని అంశాలను వివరిస్తున్నారు. కనీసం 500 మందికి తగ్గకుండా రైతులు పాల్గొనేలా దృష్టి సారించడంతో మంచి స్పందన వస్తోంది.

రైతుల సందేహాల నివృత్తికి..

జిల్లా వ్యాప్తంగా రైతులను భూములకు సంబంధించి అనేక సమస్యలు వేధిస్తున్నాయి. కొన్నేళ్లుగా వీటికి పరిష్కారం లభించక వివాదాలు నెలకొంటున్నాయి. గత ప్రభుత్వం అమలుచేసిన ధరణి అన్ని సమస్యలకు పరిష్కారం చూపలేకపోయింది. దీంతో ఈ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై అవగాహన కల్పిస్తూనే రైతులకు సమాచారం ఇవ్వడం, దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేశారు. ఇక్కడ ఎదురయ్యే సందేహాలు, అందే ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు.

ఈనెల 30వరకు సదస్సులు

భూ భారతి చట్టంపై అవగాహన కోసం ఈనెల 17న ప్రారంభమైన సదస్సులు 30వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో సదస్సులు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే పాలేరు, ఖమ్మం నియోజకవర్గాలతో పాటు, మధిర నియోజకవర్గంలోని పలు మండలాల్లో సదస్సులు పూర్తయ్యాయి. ఈనెల 25న వైరా నియోజకవర్గ పరిధి వైరా మండలం, ఏన్కూరు మండలంలో, 26న కొణిజర్ల, సింగరేణి, 28న సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి, వేంసూరు, 29న కల్లూరు, పెనుబల్లి, 30న ఉదయం తల్లాడ మండలంలో సదస్సులు జరగనున్నాయి.

రెండు బార్లకు పది దరఖాస్తులు

- ఈనెల 26వ తేదీతో ముగియనున్న గడువు
- ఖమ్మం బార్లపై ఏపీ వ్యాపారుల ఆసక్తి



ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డికి దరఖాస్తు ఇస్తున్న మహిళ

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూతపడిన రెండు బార్ల కేటాయింపునకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 26తో ముగియనుంది. ఖమ్మం బస్ డిపో రోడ్డు, నెహ్రూనగర్‌లోని రెండు బార్లకు లైసెన్స్ ఫీజు చెల్లించకపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం మూతబడ్డాయి. వీటిని కొత్త వారికి అప్పగించేందుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈనెల 1న మొదలైన ప్రక్రియ 26వ తేదీతో ముగియనుండగా, మంగళవారం వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కానీ అనూహ్యంగా బుధవారం మంచి రోజుగా భావిస్తూ పది మంది దరఖాస్తులు సమర్పించారు. మిగిలిన మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. అయితే, ఖమ్మం ఏపీకి సరిహద్దుగా ఉండడంతో ఇక్కడి బార్లను దక్కించుకోవడంపై ఆంధ్రా వ్యాపారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒక బార్‌ను టెండర్లలో దక్కించుకుని మునుపెన్నడూ లేని విధంగా అత్యాధునిక హంగులతో ఏర్పాటుచేయాలనే భావనతో ఇప్పటికే స్థానిక మద్యం వ్యాపారులతో చర్చించినట్లు సమాచారం.

ఈనెల 29వ తేదీన డ్రా

ఖమ్మంలో రెండు బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణకు గడువు 26వ తేదీతో ముగియనుండగా, 29వ తేదీన డ్రా ద్వారా ఖరారు చేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రూ.లక్ష చలానాతో పాటు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులు స్వీకరిస్తుండగా, డ్రా లో బార్ దక్కకున్నా చలానా నగదు తిరిగి ఇవ్వబోమని వెల్లడించారు. అయితే, దరఖాస్తుల ద్వారా రూ.కోటి మేర ఆదాయం సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, ఖమ్మంలో ప్రస్తుతం 30 బార్లు ఉండగా, కొత్తవి ఏర్పాటైతే ఈ సంఖ్య 32కు చేరనుంది.

పహల్గాం దాడిపై కన్నెర్ర



కొవ్వొత్తుల ర్యాలీలో బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం సహకారనగర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో కాల్పులు జరిపిన ముష్కరుల తీరుపై ప్రజలు, పార్టీలు, సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేయగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్.కోటేశ్వరరావు, నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, నున్న రవికుమార్, వీరూ గౌడ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. టీజీఈ జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యాన టీఎన్జీవోస్ భవన్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో కొణిదెన శ్రీనివాస్, మోదుగు వేలాద్రి తదితరులు పాల్గొన్నారు. ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పి.నాగేశ్వరరావు కోరారు.

ఎర్లీబర్డ్‌కు ఏడు రోజులే..

- పన్ను రాయితీపై మున్సిపాలిటీల్లో ప్రచారం అంతంతే
- కేఎంసీలో రూ.5.16 కోట్లకు చేరిన ఆదాయం
- అన్నిచోట్ల దృష్టి సారిస్తే వసూళ్లు పెరిగే అవకాశం



ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్, కార్పొరేషన్లలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఎర్లీబర్డ్ స్కీమ్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ అందుతుంది. జిల్లాలో ముందస్తుగా పన్నులు చెల్లించే కొందరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఏడాది వరకు వంద శాతం పన్ను చెల్లించిన వారిని అర్హులుగా గుర్తించగా... అసెస్‌మెంట్ల యజమానులు పలువురికి అర్హత ఉన్నా అవగాహన లేక ముందుకు రావడం లేదని తెలుస్తోంది. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం చేస్తే పన్ను చెల్లించే వారి సంఖ్య పెరగడమే కాక పుర, నగర పాలక సంస్థలకు ముందస్తుగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుంది.

కార్పొరేషన్‌లో రూ.5.16 కోట్లు..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎర్లీబర్డ్ స్కీమ్‌కు చెల్లింపుదారుల నుంచి సానుకూల స్పందనే వస్తోంది. రెవెన్యూ అధికారులు, సిబ్బందితోపాటు ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో బుధవారం నాటికి రూ.5.16 కోట్ల మేర వసూలయ్యాయి. ఈ ఏడాది ఎర్లీబర్డ్ స్కీమ్‌లో రూ.10 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా, యాభై శాతం దాటేశారు. మిగిలిన ఏడు రోజుల్లో మరింత శ్రద్ధ వహించి లక్ష్యాన్ని చేరాలనే భావనతో ఉన్నారు.

మున్సిపాలిటీల్లో నామమాత్రంగా..

జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు ఉన్నాయి. కార్పొరేషన్‌తో పోలిస్తే మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ స్కీమ్‌పై అధికారులు పెద్దగా ప్రచారం చేస్తున్నట్లు కనిపించడంలేదు. తద్వారా పన్నుల వసూళ్లలో 5 నుంచి 10 శాతం కూడా లక్ష్యాలను చేరలేదు. ఈ పథకం ద్వారా ఎక్కువ మొత్తంలో పన్నులు రాబడితే మిగతా సమయంలో లక్ష్యాల సాధన సులువవుతుంది. అంతే కాక యజమానులు ఏటా క్రమం తప్పకుండా పన్ను చెల్లించేందుకు ముందుకొస్తారు. ఈమేరకు అధికారులు స్పందించి మిగిలిన ఏడు రోజులను సద్వినియోగం చేసుకుంటే మున్సిపాలిటీలకు ఆదాయం పెరగనుంది.

కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా వివరాలు

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	అర్హత కలిగిన అసెస్‌మెంట్లు	ఎర్లీ బర్డ్ లక్ష్యం	ఇప్పటివరకు వసూలు
ఖమ్మం	5,1770	రూ.10కోట్లు	రూ.5.16 కోట్లు
సత్తుపల్లి	9,736	రూ.4.61 కోట్లు	రూ.51లక్షలు
మధిర	8,804	రూ.2.70కోట్లు	రూ.25.50లక్షలు
వైరా	7,113	రూ.2.73కోట్లు	రూ.2లక్షలు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్‌లో రూ.1.30 కోట్లతో నిర్మించే సైడ్ డ్రెయిన్ పనులకు బుధవారం శంకుస్థాపన చేసిన ఆయన ఏలువారిగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. భూసమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో పేదల భూములకు భద్రత లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సంపూర్ణ పరిష్కారం



మధిర : మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన ఆర్డీఓ నర్సింహారావు తదితరులు

'భూ భారతి' సదస్సులో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మధిర: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూసమస్యలన్నింటినీ పరిష్కరించి, భూ యజమానులు, రైతులు సంతోషంగా ఉండేలా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మధిరలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భూములపై నెలకొన్న వివాదాలను పారదర్శకంగా పరిష్కరించేలా భూ భారతి అమలవుతుందని చెప్పారు. భూమి విలువ ఆధారంగా కలెక్టర్, ఆర్డీవో స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తామని, రికార్డుల నిర్వహణ మెరుగవుతుందని తెలిపారు. ఈమేరకు సదస్సుల్లో రైతులు పాల్గొని తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలని, సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మధిర తహసీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

■ **నేలకొండపల్లి:** భూ భారతిపై నిర్వహిస్తున్న సదస్సుల్లో భాగంగా వచ్చిన దరఖాస్తులను నేలకొండపల్లి తహసీల్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. ఎలాంటి సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చాయో ఆరా తీసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, ఆర్డీఓ నరసింహారావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, డీటీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, హెల్ప్‌డెస్క్‌లో అదనపు సిబ్బందిని నియమించి సదస్సులపై విస్తృత ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, కడియాల నరేష్ తదితరులు కలెక్టర్‌ను కోరారు.



చిన్నారి తల్లిని సన్మానిస్తున్న కలెక్టర్

■ **మధిర:** మానవ సృష్టి, మనుగడ మహిళలతో సాధ్యమవుతుందనే విషయాన్ని గుర్తించి ఆడబిడ్డలకు మగపిల్లలతో సమానంగా అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మధిర మండలం దెందుకూరులో ఆడపిల్లకు జన్మనిచ్చిన ఎస్.కే.సుహనా – సమీర్ దంపతులను 'మా పాప.. మా ఇంటి మణిదీపం'లో కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, సీడీపీఓ ఎ.శ్రీనివాస్, తహసీల్దార్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

సెగలు కక్కుతున్న సూరీడు



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన ఖమ్మం బైపాస్ రోడ్ (ఇన్‌సెట్) స్కార్ఫ్‌లు కట్టుకుని బైక్‌పై వెళ్తున్న మహిళలు

- జిల్లాలో గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఈనెల 26వ తేదీ వరకు ఇదే పరిస్థితి
- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ కేంద్రం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాపై భానుడు తన ప్రభావం చూపుతున్నాడు. బుధవారం గరిష్టంగా 43 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు కాగా, మరో మూడు రోజుల పాటు ఎండ తీవ్రత, వేడి గాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే జిల్లాలతో విడుదల చేసిన బులెటిన్‌లో ఖమ్మం కూడా ఉంది. జిల్లాలో గురు, శుక్ర, శనివారాల్లో ఉష్ణోగ్రతలు 41–44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించిన నేపథ్యాన అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

పెనుబల్లిలో అత్యధికం

జిల్లాలో బుధవారం గరిష్టంగా 43 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత, వేడి గాలుల కారణంగా ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం 9గంటల వరకే ఎండ తీవ్రత మొదలై 11 గంటలకల్లా తీవ్రరూపం దాలుస్తోంది. సాయంత్రం 4గంటల వరకు వేడి గాలుల ప్రభావం ఉంటుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో మధ్యాహ్నం వేళ జిల్లా అంతటా ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. బుధవారం పెనుబల్లిలో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, నేలకొండపల్లి, ఎర్రుపాలెంలో 42.9, ఖమ్మం ఖానాపురం, సిరిపురంలో 42.8, వైరా, పమ్మిలో 42.7, చింతకానిలో 42.6, కూసుమంచి, రఘునాథపాలెం, బాణాపురంలో 42.5, పల్లెగూడెంలో 42.4, మధిరలో 42.3, సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో 42.2, మధిర ఏఆర్‌ఎస్‌లో 42.1, రావినూతల, నాగులవంచ 42 ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. అంతేకాక ఖమ్మం ఎన్నెస్పీ, గంగారం తిరుమలాయపాలెంలో 41.8, సదాశివపాలెం, బచ్చోడులో 41.6, ఖమ్మం కలెక్టరేట్ 41.5, వేంసూరు, ఏన్కూరు, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 41.4, పెద్దగోపతిలో 41.3, కల్లూరు, తల్లాడ, కుర్నవల్లి, కాకరవాయి, వైరా ఏఆర్‌ఎస్ 41.1, లింగాల 41, ముది గొండ 40, సత్తుపల్లి, మంచుకొండ 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యల్పంగా గుబ్బగుర్తిలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జిగేల్‌మనేలా విద్యుత్ వెలుగులు

సబ్‌స్టేషన్ల ఇంటర్ లింకింగ్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

- చకచకా కొత్త సబ్‌స్టేషన్లు, కార్యాలయాల నిర్మాణం
- విద్యుత్ శాఖ మంత్రిగా భట్టి ఉండడంతో ప్రతిపాదనలకు మోక్షం


మధిరలోని 132 కేవీ. విద్యుత్ సబ్‌స్టేషన్

మధిర: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చాలాచోట్ల చిన్నపాటి వర్షం కురిసినా, గాలిదుమారం మొదలైనా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ఇలాంటి పరిస్థితి ఎదురైనా సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించడానికి సమయం పట్టేది. ఇంకొన్ని చోట్ల లోఓల్టేజీ సమస్య వేధించేది. ఉద్యోగుల కొరత, సరిపడా పరికరాలు లేకపోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యేవి. కానీ ఇప్పుడు చాలా మార్పులు జరిగాయి. సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, రెండేసి సబ్‌స్టేషన్ల నడుమ ప్రత్యామ్నాయ లైన్లు వేయడంతో పాటు సిబ్బందికి కావాల్సిన పరికరాలు, వాహనాలను సమకూర్చడంతో మరమ్మతుల్లో వేగం పెరిగింది. జిల్లాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగానే కాక విద్యుత్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తుండడంతో కావాల్సిన నిధులు, కొత్త సబ్‌స్టేషన్లు, కార్యాలయాలకు భవనాలపై ప్రతిపాదనలు వెళ్లిన వెంటనే మంజూరవుతుండడంతో పనుల్లోనూ వేగం పెరిగింది.

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు

ఎర్రుపాలెం మండలంలోని పెద్ద గోపవరం రెవెన్యూ పరిధిలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అలాగే, మధిర మండలం మాటూరులో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైంది. ఇంకా రాయపట్నం, రేమిడిచర్ల, వైరా టౌన్, రెబ్బవరం, బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం, చిరునోములల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.21 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా త్వరలోనే మంజూరయ్యే అవకాశముంది.

లోడ్ ఆధారంగా..

వైరా డివిజన్‌లో వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు.. మధిర టౌన్, మధిర రూరల్, ఎర్రుపాలెం, మామునూరు, బోనకల్, వైరా టౌన్, వైరా రూరల్ సెక్షన్లు ఉన్నాయి. ఈ డివిజన్‌లో రూ.5.50 కోట్లతో 238 నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేస్తుండగా.. మధిర, వైరా మండల కేంద్రాల్లో రూ.65 లక్షలతో విద్యుత్ ఫీడర్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6నుంచి రాత్రి 10 గంటల మధ్య నమోదయ్యే విద్యుత్ లోడును పరిగణనలోకి తీసుకుని ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండడంతో అంతరాయాలు ఎదురుకావని చెబుతున్నారు.

సబ్ స్టేషన్ల అనుసంధానం

ఏదైనా ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆ సమస్యను పరిష్కరించేంత వరకు ఇబ్బందులు ఉండేది. కానీ రూ.3.66కోట్ల నిధులతో చేపట్టిన ఇంటర్ లింకింగ్ లైన్లతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఖమ్మం సమీపాన పెద్దగోపతి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి బోనకల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, బోనకల్ నుంచి సిరిపురానికి, అక్కడ నుంచి మధిర 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ సబ్‌స్టేషన్లలో రూ.1.90కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. తద్వారా మధిర సబ్‌స్టేషన్ నుంచి బోనకల్ ఫీడర్‌కు సరఫరాలో అంతరాయం ఏర్పడితే పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి జానకీపురం.. ఆపై బోనకల్ సరఫరా చేసే వీలు కలుగుతోంది. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మధిరతో పాటు జిల్లాలోని సమస్యలపై అవగాహన ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన చోట్ల స్తంభాల ఏర్పాటు, ప్రమాదకరంగా ఉన్న తీగల తొలగింపు పనులకు నిధులు కేటాయిస్తుండడంతో అధికారులు ప్రత్యేక దృష్టితో పనులు చేపడుతున్నారు.

భవన నిర్మాణాలు


నూతనంగా నిర్మిస్తున్న ఏడీఈ, రెవెన్యూ కార్యాలయాలు

మధిరలో విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం 1991లో ఏర్పాటైంది. అప్పటినుంచి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, రెవెన్యూ కార్యాలయాలు ఇరిగేషన్ శాఖకు సంబంధించి రేకుల షెడ్లలో కొనసాగుతున్నాయి. వర్షం వస్తే లోపలకు నీళ్లు చేరి ఫైళ్లు తడిచిపోతున్నాయి. ఈమేరకు విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో కార్యాలయ నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. అలాగే, వైరా డివిజన్, రెవెన్యూ కార్యాలయాల భవన నిర్మాణానికి సైతం రూ.70 లక్షలు మంజూరయ్యాయి.

త్వరగా పనుల పూర్తి



గతంలో వేధించిన లో ఓల్టేజీ సమస్య ఇప్పుడు లేదు. అంతేకాక ఏదైనా సమస్యపై గతంలో ఫిర్యాదు చేస్తే పరిష్కరించడానికి నెలలు, ఒక్కోసారి సంవత్సరాలు గడిచేది. కానీ ఇప్పుడు దరఖాస్తు చేసుకోగానే రోజుల వ్యవధిలోనే పనులు చేస్తున్నారు.
– కె.పట్టాభిరామశర్మ, మధిర

రైతులకు సౌకర్యంగా..



పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్‌తో కాలిపోయేవి. రైతులే చందాలు వేసుకుని అధికారులు చుట్టూ తిరిగితే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వచ్చేది. కానీ మధిర నుంచి గెలిచిన భట్టి విక్రమార్క చొరవతో అలాంటి సమస్యలు దాదాపు పరిష్కారమయ్యాయి.
– శీలం వెంకటరామిరెడ్డి, రైతు, నరసింహాపురం

నాణ్యమైన విద్యుత్ సరఫరా



ఉన్నతాధికారుల ఆదేశాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలవుతోంది. ఓవర్‌లోడ్ ఉన్న చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, 200 పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా మిగతా సమస్యలు పరిష్కరిస్తున్నాం.
– అనురాధ, ఏడీఈ, మధిర

జూన్ 6నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పీజీ కోర్సుల(నాన్ ప్రొఫెషనల్) సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) జూన్ 6నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. పరీక్షలు ఈనెల 26నుంచే నిర్వహించాల్సి ఉన్న వాయిదా వేశారు. ఈమేరకు రీషెడ్యూల్ చేస్తూ టైంటేబుల్‌ను బుధవారం విడుదల చేశారు. జూన్ 6, 9, 11,13, 16, 18వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల పరీక్షలు జరుగుతాయని, వివరాలను కేయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

ఇంటర్‌లో బధిర సోదరుల ప్రతిభ


జయసూర్య, భానుతేజ

కల్లూరు: కల్లూరుకు చెందిన బధిరులైన సోదరులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివి మెరుగైన మార్కులు సాధించారు. కల్లూరు వాసి, కేఎస్ఎస్ చర్చి ఫాదర్ పేరుమాల్ల దయాకర్ – సుకన్య దంపతుల కుమారులు జయసూర్య, భానుతేజ పుట్టుకతోనే బధిరులు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ చదివిన వీరిలో భానుతేజ 500కు 306, జయసూర్య 302 మార్కులు సాధించగా పలువురు అభినందించారు.

జీపీ కార్యదర్శులకు ముగిసిన శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎంసీహెచ్ఆర్‌డీలో రెండు రోజులుగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. పంచాయతీరాజ్ చట్టం, సమాచార హక్కు చట్టంతో పాటు కార్యదర్శుల పాత్రపై శిక్షణ ఇచ్చామని ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ ఏవీఆర్.కొండల్‌రావు తెలిపారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ఎంపీడీఓలు రోజారాణి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీదేవి, రిటైర్డు ఎంపీడీఓలు అశోక్‌కుమార్‌రెడ్డి, మురహరిరావు వ్యవహరించగా, 26మంది కార్యదర్శులు హాజరయ్యారు.

పది మందికి పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: స్పౌజ్ కేటగిరీలో భాగంగా ఇటీవల చేపట్టిన బదిలీల్లో జిల్లాకు కొత్తగా 10మంది ఉపాధ్యాయులను కేటాయించారు. వీరికి బుధవారం పోస్టింగ్ ఇచ్చినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఏళ్ల తరబడి భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తుండగా ఎట్టకేలకు ఒక చోటకు చేరడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

నేలకొండపల్లి: ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మండలంలోని శంకరగిరితండాకు చెందిన వ్యవసాయ కూలీలు ముదిగొండ మండలం మాధాపురంలో మిర్చి తోట ఏరేందుకు కొద్దిరోజులుగా వెళ్తున్నారు. బుధవారం కూడా పని ముగిశాక వారు వస్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో మాధవి(25)కి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా చికిత్స చేయించి ఖమ్మం తరలించగా మృతి చెందింది. అలాగే, ఆటోలో ఉన్న మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి.

వరిగడ్డి వాము దగ్ధం

ఖమ్మంక్రైం: ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న గడ్డివాముకు బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వాహనం నేరడ వెళ్లినట్లు బదులిచ్చారు. చివరకు వ్యవసాయ మార్కెట్‌లోని వాహనాన్ని పంపించగా మంటలు అదుపు చేశారు. కాగా, వాహనం రావడంతో ఆర్పివేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో.. మంటలు మరింత వ్యాపిస్తే ఇళ్లకు ముప్పు వాటిల్లేదని ఉద్యోగులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడికి సెలవు.. చదువుకు విరామం!

విద్యాసంవత్సరం బుధవారంతో ముగియగా గురువారం నుంచి వేసవి సెలవులు మొదలుకానున్నాయి. దీంతో బుధవారం పాఠశాలలు ముగియగానే విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు. గురుకులాలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి సామగ్రి సహా స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో బస్సులు, ప్రైవేట్ వాహనాలు కిక్కిరిసి కనిపించాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఇంటికి బయలుదేరిన విద్యార్థిని


గురుకులం నుండి సామగ్రితో వెళ్తున్న విద్యార్థినులు


సామగ్రి, కుమార్తెలతో బస్టాండ్‌కు వెళ్తున్న తల్లి

టేకు, నిమ్మ చెట్లు దగ్ధం

కొణిజర్ల: గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్న దంటుకు నిప్పంటించడంతో మంటలు వ్యాపించి టేకు, నిమ్మ చెట్లు కాలిపోయిన ఘటన మండలంలోని పెద్దగోపతిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు కోటపాటి సుబ్బలక్ష్మి, తిరుపతిరావు ఎకరం భూమిలో నిమ్మతోట నాటి, చుట్టూ టేకు చెట్లు పెంచుతున్నారు. సమీప రైతులు మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టగా మంటలు వ్యాపించాయి. ఈమేరకు వైరా నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పేలోగా చెట్లు కాలిపోయాయని తెలిపారు.

ముద్దునూరు చెరువులో వ్యక్తి గల్లంతు

తల్లాడ: మండలంలోని ముద్దునూరు చెరువులో బుధవారం పడి రిటైర్డ్ ఉద్యోగి గల్లంతయ్యాడు. సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయిన గ్రామ వాసి కాకర్ల అప్పారావు(63) తన గేదె, దూడ మేత కోసం పొలంలో ఉండగా తీసుకొచ్చేందుకు వెళ్లాడు. సమీపంలోని చెరువులోకి గేదె, దూడ దిగి లోతులోకి వెళ్తుండగా అప్పారావు దూడను బయటకు తీసుకొచ్చే క్రమాన ఆయన ఊబిలో కూరుకుని గల్లంతయ్యాడు. ఈమేరకు గజ ఈతగాళ్లతో గాలిస్తుండగా, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం శివారులో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకోవడమేకాక రూ.15,100 నగదుతో పాటు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ అమిత్‌రెడ్డి రాక

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ పి.మోహనమురళి తెలిపారు. ఖమ్మం రోటరీనగర్‌లోని డెయిరీలో జరిగే పాల ఉత్పత్తిదారుల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. పాల ఉత్పత్తిలో మెళకువలు, విక్రయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలే కాక ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరిస్తామని తెలిపారు. తొలుత ఖమ్మం రైతుబజార్, కొణిజర్లలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్లను చైర్మన్ ప్రారంభిస్తారని డీడీ పేర్కొన్నారు.

'వనజీవి' కుటుంబానికి మాజీ ఎంపీ చేయూత


రామయ్య కుటుంబానికి నగదు అందిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల మృతి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ గురువారం జరగనున్న నేపథ్యాన ఆయన కుటుంబానికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని రామయ్య స్వగృహంలో ఆయన సతీమణి జానకమ్మకు బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, కనకమేడల సత్యనారాయణ నగదు అందజేశారు. నాయకులు పేరం వెంకటేశ్వర్లు, గొడ్డేటి మాధవరావు, వాకాదని కోటేశ్వరరావు, పాల్వంచ రాజేష్, బానోత్ కృష్ణ, శీలం రవికుమార్, ఏపూరి తరుణ్, మేకల ఉదయ్‌కుమార్, ఆలకుంట వెంకటేష్, డి.ఎల్లయ్య, పి.ఎల్లయ్య, డి.బాబు, పి.లక్ష్మయ్య, జి.వెంకటేష్, కళ్లెం సీతయ్య, ఎరవుల రాజా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ పరిశీలకుల నియామకం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులను నియమించింది. జిల్లా పరిశీలకులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు అదే జిల్లాకు చెందిన నాయకుడు బత్తిని శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పేరిట బుధవారం ఓ ప్రకటన విడుదలైంది.

25న ఉద్యోగుల బైక్ ర్యాలీ, సదస్సు

రఘునాథపాలెం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, కార్యాచరణపై చర్చించేందుకు ఈనెల 25న ఖమ్మంలో నిర్వహిస్తున్న ర్యాలీ, సదస్సును విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని వేపకుంట్లలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్ నుంచి టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ ర్యాలీగా వెళ్లనుండగా, అక్కడ సదస్సు ఉంటుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఈ సమావేశంలో సతీష్, సక్రాం, శిరీష, ప్రసాద్, శేషగిరి, పాండురాజు, అరుణ, దాసు, శారద, కృష్ణార్జున్ పాల్గొన్నారు.

25న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: సీనియర్స్ మహిళల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టును ఎంపిక చేసేందుకు ఈనెల 25న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సి.రఘునందన్ తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

భరతనాట్యం శిక్షణార్థులకు పరీక్ష


పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

ఖమ్మంగాంధీచౌక్: భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఖమ్మం వండర్ కిడ్స్ పాఠశాలలో బుధవారం చండీగఢ్ యూనివర్సిటీ ఆధ్వర్యాన పరీక్ష నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన కళాకారిణి ప్రతిమా సునీల్ పర్యవేక్షణలో పరీక్ష కొనసాగగా, పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన వేసవిలో నీటి ఇక్కట్లు, ఇంకుడు గుంతల నిర్మాణంపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో సమీక్షించారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంటింటికి తాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు, ప్రస్తుతం సరఫరాలో, అవాంతరాలు, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఆరా తీశాక కలెక్టర్ మాట్లాడారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని, ఇందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. అంతేకాక ప్రతీ వాణిజ్య భవనం, గృహాల్లో ఇంకుడుగుంతల తప్పక ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, మధిర, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, ఏ.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన జేఏసీ బాధ్యులు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా బాధ్యులు బుధవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మంలో కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణతో పాటు పారుపల్లి నాగేశ్వరావు, ఎస్.విజయ్, నాగేశ్వరరావు, వెంగళరావు, రంజాన్, వెంకటేశ్వర్లు, బిక్కు, సుబ్బయ్య , కొణిదన శ్రీనివాస్, మోదుగు వేలాద్రి, వల్లపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మం సుందరయ్య భవనంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2002 తర్వాత ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు జరుగుతుండగా, తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మహాసభల్లో 33 జిల్లాలు, పదహారు యూనివర్సిటీల నుంచి 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. తొలిరోజైన శుక్రవారం ఉదయం వేలాది మందితో ర్యాలీ నిర్వహించాక భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడు వీ.పీ.సాను, సినీ నటుడు మాదాల రవి, ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి పాల్గొంటారన్నారు. విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాగరాజు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, టి.ప్రవీణ్, నాయకులు దొంతబోయిన వెంకటేష్, వినోద్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌లో డీడీఎం పరిశీలన


యార్డులో పరిశీలిస్తున్న డీడీఎం పద్మావతి, చైర్మన్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల కొనుగోళ్లను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి బుధవారం పరిశీలించారు. మిర్చి జెండా పాట, ధర ఖరారుపై రైతులతో మాట్లాడిన ఆమె సమస్యలపై ఆరా తీశారు. అలాగే, కాంటాల తీరును కూడా తనిఖీ చేశారు. అనంతరం మార్కెట్‌లో రూ.155.35 కోట్లతో చేపట్టిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతేకాక సీసీఐ పత్తి కొనుగోళ్లలో వచ్చిన ఆరోపణలపై అధికారులతో చర్చించినట్లు సమాచారం. తాతాలిక రిజిస్ట్రేషన్ల(టీఆర్)కు సంబంధించి ఎన్ని పుస్తకాలు ముద్రించారు, ఎవరెవరికి జారీ చేశారనే అంశాలు ఆరా తీసినట్లు తెలిసింది. మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–2 కార్యదర్శి సృజన్ బాబు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌దే గెలుపు

పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

కారేపల్లి: రాష్ట్రంలో మరో మూడేళ్ల తర్వాతైనా, ఇంకా ముందైనా ఎన్నికలు వస్తే తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం చేసే పోరాటంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గబోమని తెలిపారు. కాగా, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులతో వెళ్లనున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు. అనంతరం వెంకట్యాతండాలో బీఆర్ఎస్ నాయకుడు బానోత్ భాస్కర్‌ను పరామర్శించారు. నాయకులు ముత్యాల సత్యనారాయణ, రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ఆడేపు పుల్లారావు, పిల్లి వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకట అప్పారావు, బత్తుల శ్రీనివాసరావు, బానోత్ రాందాస్‌నాయక్, జూపల్లి రాము పాల్గొన్నారు.